# సంగమేశ్వరం

ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రం కాదా! ఇక భారతీయ నాయకులు ఈ రాష్ట్ర సమస్యను నూరుగజాల లోతు గోతిలోపెట్టి సిమెంటు కాంక్రీటు వేసి పూడ్చివేస్తారా? అని, పత్రిక చదువుకుంటూనే కృష్ణవేణి ఉద్రిక్త హృదయంతో కుర్చీనుండి ఆడపులిలా లేచింది.

కృష్ణవేణి ఇరవైమూడేండ్ల జవ్వనం పరిపూర్ణత తాల్చిన ఆంధ్రబాలిక. ఆమె మోము సౌందర్య యుతమూకాదు; ఛాయ బంగారుఛాయా కాదు; మాలతీ తీగలా కౌనుకలిగిన యువతీకాదు. ఆమె ముక్కు కొంచెం పొట్టిది. ఆమె కళ్లుకొంచెం చిన్నవి. ఆమె నుదురు చెప్పుకోతగిన స్నిగ్ధత్వం కలదికాదు, ఆమె మోము కోలనైనదీకాదు, గుండ్రనైనదీకాదు. కాని ఒక అవయవరేఖకూ ఇంకొక అవయవరేఖకూ ఏదోశ్రుతి వైచిత్యం సమకూడడంచేత గాఢంగా అందరి హృదయాలూ ఆకర్షిస్తుంది. ఆమెచూపులు వెన్నెల వెలుగులు, ఉదయారుణ కిరణాలు రంగరించి పోతపోసిన విలక్షణ సౌందర్య యుక్తాలై నా గుండె గుబగుబలాడిస్తూ ఉంటవి.

కృష్ణవేణి టెన్నీసు ఆటలో ఆరితేరిన దిట్ట. కాబట్టే ఆమెకూ నాకూ అనంతపురం కాలేజీలో పరిచయం లభ్యమైంది. ఆమె చెన్నపట్టణం ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుతూ ఉండేది. నేను ఆ దినాలలో అనంతపురం కాలేజీలో బియ్యే చదువుతుండేవాడిని. ఆడ మగజట్టు పోటీ ఆటలలో చివరి పందెంలో మేమిద్దరం ఎదిరి బొదిరిగా నిలుచున్న వాళ్ళము ఆ బాలిక, ఇంకో ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థి ఒకవైపు – నేను, నా సహాధ్యాయురాలు ఒక వైపు ఆడాము. మాకన్న ఆ జట్టే దిట్టమైనది అనుకోండి. అయినా ఆ సాయంత్రం అల్లా ఎదిరిజట్టును ముప్పుతిప్పలు పెడితేనేగాని విజయం వారికి మేము చేకూర్చనీయలేదు. అందుకనే నాకూ కృష్ణవేణికీ ఎంతో గాఢమైన స్నేహం ఆరంభమైంది.

నేను రాయలసీమవాణ్ణి. నాకు ఆంధ్రదేశంలో రాయలసీమ లీనమై పోవటం ఏమాత్రం ఇష్టంలేదు. కృష్ణవేణి అసలైన సిసలైన ఆంధ్రబాలిక. ఆంధ్రమాతకు జై అంటుంది. భారతదేశంలోని రాష్ట్రాలన్నిటిలో ఆంధ్రదేశము మహోన్నతమంటుంది. భరతదేశానికి అఖిల ప్రపంచానికీ ఆంధ్రదేశమే సంస్కృతిలో గురుపీఠం వహించిన దంటుంది. ఆంధ్రత్వం వెల్లివిరిసే ఏ సభకైనా కృష్ణవేణి స్వచ్ఛంద సేవకురాలుగాను, సభ్యురాలుగాను చేరుతుంది.

నాకు ఆంధ్రత్వమంటేనే మంట, నా నమ్మకంలో శాతవాహనులు మహారాష్ట్రులనీ, ఇక్ష్వాకులు ఉత్తరాదివారనీ, పల్లవులు అరవలనీ, చాళుక్యులు కన్నడులనీ, విజయనగరం

వారూ కన్నడులేననీ నమ్మకం. ఈ నమ్మకానికి చరిత్ర ఆధారం అయితే అవుతుంది - కాకపోతే కాకపోతుంది. కోస్తా జిల్లాలవారి మీదుండే కోపమే యీనమ్మకానికి గల కారణం. కోస్తా జిల్లాల వారికి ఎంతగర్వమండీ? రాయలసీమ వాళ్ళంటే వాళ్ళకు గౌరవంలేదనీ, మమ్మల్ని చిన్న చూపుచూస్తారనీ నాకు ఏదో అనుమానం. ఈ అనుమానం సత్యాధారమైతే నేమి, అసత్యాధారమైతేనేమి నాకు అవసరం లేదు. నా అనంతపురం కాలేజీలో చేరటానికి కోస్తాజిల్లా విద్యార్థులు కొందరు వచ్చేవారు. కొందరు ఆచార్యులూ వచ్చేవారు. వాళ్ళని ఏడిపించటం అంటే మహాసరదాపడేవాణ్ణి. కాని అది చేతకాకపోయేది. అందుచేత మరీకోపం వచ్చేది. నాపేరు నరసింహారావు. మా యింటిపేరు కదిరివారు. ఇంతకూ నేను రాయలసీమవాసుణ్ణి.

## 2

ఇక్కడే మా కథ ప్రారంభమైంది. ఆమె కృష్ణాతీరంలో కృష్ణా జిల్లాలో పుట్టింది. అందుకనే వాళ్ళ వాళ్ళు 'కృష్ణవేణి' అనిపేరుపెట్టారుట. కృష్ణవేణి అనంతపురం వచ్చి టెన్నీసు ఆట ఆడినప్పటినుంచీ నేను ఆమెకు బానిసనయ్యాను. ఆమె మాటలలో మెరపువేగం, నేను వట్టి మందప్రవాహాన్ని కాబట్టి యీ ఆంధ్రదేశాన్ని గురించి ఎప్పుడు వాదనవచ్చినా నేను చేతులు జోడించవలసి వచ్చేది. అందువలన ఆంధ్రవాదనంటే మరీ మంటగా ఉండేది నాకు.

అనంతపురం కాలేజీలో ప్రారంభమైన మా స్నేహం అనేక విధాలుగా వృద్ధిపొందింది. ఆమె నన్ను హృదయపూర్వకంగా మద్రాసుకు ఆహ్వానించింది. ఆమె పిలవటం తరవాయిగా నేను రెక్కలుకట్టుకొని అక్కడికి వాలేవాణ్ణి. ఆ బాలిక సెలవులలో మా ధర్మవరం వచ్చి నన్ను కలుసుకునేది. నేను ఆమె కలిసి పెనుకొండ, హిందుపురం, లేపాక్షి ఒకసారీ, హంపి ఇంకోసారీ, తాడిపత్రి, గుత్తీమరి ఒకసారీ - విజయనగర శిల్పోత్కృష్ట భాగ్యాన్ని సందర్శించటానికి వెళ్ళేవాళ్ళము.

నేను అనంతపురంలో బియ్యే పూర్తిచేసుకొని గిండీ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగు క్లాసులో చేరాను. ఆమె తన కళాశాలలోనే బి.యస్‌సి. ఆనర్సు క్లాసులో చేరింది. ఇంక మా స్నేహం శరత్కాల చంద్రికలా, వసంతసౌరభంలా వికసించిందంటే వికసించదా?

ఆమె బి.యస్‌సి. ఆనర్సూ పూర్తిచేసింది. నేను ఇంజనీరింగూ పూర్తిచేశాను. ఆ సెలవుల్లో కృష్ణాతీరంలో వున్న వాళ్ళ వూళ్లోనే కలుసుకున్నాము. నేను వచ్చి వారంరోజులైంది. ఆ సాయంత్రం వాళ్ళ ఇంటి తోటలో కుర్చీలలో కూర్చొని ఉన్నాము. అప్పుడే పోస్టునుంచి పేపరు వచ్చింది. పేపరు నేలవేసికొట్టి; ఆడుపులిలా అయిపోయి 'ఆంధ్రులు యీ విషయంలో చప్పగా ఊరుకోరు' అని కుర్చీమీదనుంచి లేచి నుంచుంది.

**నేను:** ఏం వార్త వచ్చిందేమిటి. అంతకోపం వచ్చింది నీకు? కూచో; చూస్తావేం! ఆ వార్త ఏమిటో నాకు చదివి వినిపించు. కాస్త కోపం తగ్గించు.

**కృష్ణవేణి:** నీకేం? నీవు రాయలసీమ మనిషివి. మీనాయకులంతా కలిసి మాకు ఆంధ్రరాష్ట్రం అక్కరలేదని 'ధారుకమిటీ'ట - ధారుకమిటీ చారుకవిటీ సాంబారుకమిటీ - దాని ముందర సాక్ష్యం ఇచ్చారుగా? ఆ చారుకమిటీ బోరుమని ఏడ్చిందిలే - ఆ రిపోర్టు వచ్చింది. ఆంధ్ర దేశానికి రాష్ట్రం అక్కరలేదట. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రం కోరటం చాలా తప్పట. ఇహ హాయిమనినీ గుండెమీద చేయివేసుకుని నిద్రపోవచ్చునులే!

**నేను:** ఏమిటమ్మా. నీకు అంతకోపం? దేశ సమస్యలలో మనస్సు చొప్పించటం మాని రాష్ట్రం రాష్ట్రం రాష్ట్రం అని కూచుంటే భరతదేశం అథోగతిపాలుగాక ఏమవుతుంది?

**కృష్ణ:** హోహో! మా అమ్మమ్మ ఓ సామెత చెపుతూ ఉండేదిలే "చంటివాడు బెల్లంముక్క కావాలి" అని ఏడిస్తే "ఇంటి యజమాని పంటికి దెబ్బతగిలిందట" అని, అలాఉంది నీవాదన. రాష్ట్రానికీ భరతదేశ సమస్యలకీ సంబంధం ఏముంది?

**నేను:** ఏమీలేదు, అవతల కాశ్మీరు సమస్య అలా ఉంది; ఇవతల హైదరాబాదు సమస్య సంపూర్ణంగా పరిష్కారం కాలేదు; రాష్ట్రం కావాలట!

**కృష్ణ:** తగ్గవయ్యా! తగ్గు! కాశ్మీరు సమస్య అలాగే ఉంది. పటేలు గారు సౌరాష్ట్ర యూనియను, వింధ్యప్రదేశ రాజ్యం, హిమాచలప్రాంత్ రాష్ట్రం - ఇవన్నీ నిర్మాణం చేస్తూనే ఉన్నాడు. రాజ్యప్రముఖులు, ఉపరాజ్య ప్రముఖులు ఏర్పాటు అవుతూనే ఉన్నారు. బరోడాలో గిరోడాలో నూత్న మంత్రివర్గాలు నిర్మాణమవుతూనే ఉన్నాయి. హైదరాబాదు సమస్య అట్లాగే ఉందిట? ఆహోహా!

**నేను:** అవన్నీ భారతదేశ నిర్మాణానికి ముఖ్య సమస్యలు.

**కృష్ణ:** అంతకన్నా ముఖ్యసమస్య ఆంధ్రరాష్ట్ర నిర్మాణం

**నేను:** ఎట్లాగ?

**కృష్ణ:** ఈషణ్మాత్రం జ్ఞానంవుంటే! జ్ఞానం ఉండేలా - కాంగ్రెసు పెద్ద బిడ్డలా ఆంధ్రరాష్ట్ర సమస్య ఉద్భవించింది - మహాత్మాగాంధీ ఆశీర్వదించినది. కాంగ్రెసు విధానంలో భాషాప్రయుక్త రాష్ట్రాలు నిర్మాణం అయిపోయాయి. అసలు రాజ్యాంగంలో ఆంధ్రులు అరవ వారికి దాసులుగా ఉండాలి.

**నేను:** ఆంధ్రులు రాయలసీమకి ఏమిచేశారు?

**కృష్ణ:** అరవలు రాయలసీమ నెత్తిమీద ఏమైనా ఇంత ఒలకపోశారా? రాయలసీమ వారంతా పెళ్ళికొడుకులూ, మాజిల్లాల వారంతా పెళ్ళికూతుళ్ళూనా?

ఆవేశంలో ఆమె అన్న మాటలు వినేటప్పటికి నా గుండె గుభేలుమంది. ఏదో మధురమైన భవిష్యత్తు నన్ను మత్తులా ముంచెత్తింది. బంగారు ఛాయగల నా మోములో కెంపురంగులు వచ్చినట్లు వేడిమి క్రమ్ముకున్న నా మోమునుబట్టి అనుకున్నాను. నేను కొంచెం ఖంగారు పడడం చూచింది - "ఏమిటీ ఆడపిల్ల మొఖంలా నీమొఖాన్ని గులాబీలు క్రమ్ముకుంటున్నాయి" అన్నది కృష్ణవేణి.

"ఏ... ఏ... ఏమీ లేదులే" అన్నా.

"ఏమిటా ఖంగారు? నామాటలు వినేటప్పటికి కోపం వచ్చిందా తమకు?"

నాకు ఏదో ఒక విధమైన సిగ్గు వచ్చింది. ఆనందం వచ్చింది పెళ్ళికొడుకులు! పెళ్ళికూతుళ్ళు!

"ఏమిటయ్యా ఆలోచిస్తున్నావు – నరసింహారావు! ఔను, ఆలోచించక ఏమిచేస్తావు! 28 జిల్లాల మహోత్తమ రాష్ట్రం. నాలుగుకోట్ల ఇరవై లక్షల జనాభా. టి.వి.ఎ. లాంటి అనేకానకట్టలు నిర్మించగల దేశం. సమస్త లోహములు తమగర్భంలో ఇముడ్చుకున్న కన్నతల్లి మన ఆంధ్రదేశం. ఉత్కృష్టశిల్పం, ఉత్తమ చిత్రలేఖనం, మహత్తరమైన సాహిత్యం, దివ్యమైన నాట్యసాంప్రదాయం ఆంధ్రమాత భరతమాతకు సమర్పించుకున్నది. ఇలాంటి ఆంధ్రదేశంలో పుట్టానని గర్వపడక రాయలసీమ రాయలసీమ అని ఎక్కడో దాక్కుంటా నంటావు? ఎక్కడిది యీ రాయలసీమ? ఆంధ్రదేశమంతా రాయలసీమే. ఈ దేశం అంతా విజయనగర సామ్రాజ్యంలో ఒక భాగంకాదూ ఒకనాడు?" ఆమె మాటలు గంగా ప్రవాహంలా వచ్చాయి.

**నేను:** పెద్ద ఉపన్యాసం ఇచ్చావు. హైదరాబాదు మూడుభాగాలు చేసి, ఆంధ్ర జిల్లాలు ఆంధ్రదేశంలో కలవవలసి ఉన్నది కదా! ఆ విషయం ఏదీ నిర్ధారణ కాకుండా ఆంధ్రరాష్ట్రం ఏ మొగంపెట్టుకొని కోరుతారు మీ ఆంధ్రులు అని కొంచెం తీవ్రంగానే అన్నాను.

అంతకన్న తీవ్రంగా కృష్ణవేణి "లాయరుకన్న తెలివి తేటలుగా మాట్లాడావే? నిర్మాణమైన రాష్ట్రంలో నిర్మాణం కాని భాగాలు తర్వాత కలపకూడదేం? ఒరిస్సా రాష్ట్రం ఎప్పుడో నిర్మాణమైంది? ఇప్పుడు ఎన్ని సంస్థానాలు ఆ రాష్ట్రంలో కలవటంలేదు?" అని నాపైని తీక్షణదృష్టులు బరపింది.

## 3

ఇన్ని సంవత్సరాలు మేము ఇద్దరమూ ఎన్ని విషయాలలోనో ఏకీభవించక వాదించుకున్నాము. ఒక్కొక్క తడవ తీవ్రంగానూ కలతలుపడ్డాము. అయినా కృష్ణవేణి ఎప్పుడూ కలత పొందని హృదయంతో మాస్నేహ ప్రవాహానికి ఏ అడ్డుకట్టూ రానీయలేదు. కాని ఆరోజు సంభాషణలో నామీద ఏమి కినుక వహించిందో నాతో మాట్లాడటం మానివేసింది. నాకు చురుకుపాలు ఎక్కువే!నేను రాయలసీమవాణ్ణి. కొంచెం సున్నితమైన హృదయం. నన్ను తక్కువచూపు చూస్తున్నారనే అనుమానం తగిలితే కించపడిపోతాను. సాధారణమైన కోస్తాజిల్లాల వాళ్ళతోబాటే కృష్ణవేణి నాల్గుమాటలు ఝూడించింది. నాకు అయితే కోపం రావలసిందేకాని, తనకు కోపం రా పనేమిటి? అయినా నాలో దాగివున్న ఏదో ఒక పరీమళార్ధమైన ఆశచేత నాకు నేను సమాధానం చెప్పుకొని ఆమెను వెంటనంటి తిరుగుతూనే ఉన్నాను కాని ఆమె నిర్లక్ష్యం ఏమాత్రం తగ్గలేదు. నేను కల్పించుకొని వేసే ప్రశ్నలకు ఆమె కటువుగా జవాబు చెప్పుతుంది. ఇద్దరం కలిసివెళ్ళే మాసాయంత్రపు వాహ్యాళికి ఆమెరావటం మానివేసింది.

ఎంతో సౌహార్ద్రతతో ప్రతినిమిషం నా సదుపాయాలు కనుక్కునే ఆ బాలిక నేడు వారింటి పనివాళ్ళను పంపించి నా విషయం కనుక్కోవటం సాగించింది. నా ఆశ

క్రుంగిపోయింది. నా హృదయం ఆవేదనతో నిండింది. నాకు కోపం రాసాగింది. నేను రెండు రోజులు చూచాను. మూడురోజులు చూచాను. నాలుగోరోజున నాపెట్టే బేడా సర్దుకొని తెల్లవారగట్ల ఇంట్లో ఎవరితో చెప్పకుండా ఒక కూలివాడినెత్తిమీద నా పరుపూపెట్టా పెట్టి, తోలుసంచి అవీ చేత పుచ్చుకొని బస్సులు వచ్చే దగ్గర వూరు వెళ్ళి, బెజవాడ చేరుకొని రైలు ఎక్కి ధర్మవరం చక్కా వచ్చాను.

నాకు స్త్రీ జాతిమీద ఆ రోజులలో కలిగిన కోపం స్వామీ శివశంకరులైనా వర్ణించలేరు. వెఱ్ఱివాడనై యిన్నేళ్ళూ కుక్కలా ఆమె అడుగుజాడల నడిచాను. అంటే ఆమె దగ్గరకెళ్ళి వాలాను. అంత స్నేహమూ మరచిపోయి ఎత్త మడమల బూటుకాలితో నన్ను గెంటివేసింది.

## 4

**నా**కు వచ్చిన సంబంధములు నేను ఎందుకు త్రోసివేసుకున్నాను? తల్లిదండ్రులను లెక్కచేయలేదు. కొందరి బంధువులకు విరోధి నయ్యాను. ఏదో అంతరాంతరముల అవ్యక్తమైన మధురానుభూతిని వాంఛించి ఆమె మాటల తీయదనాలు పుడిసిళ్ళ తృప్తి ఎరుగని దాహంతో గ్రోలిగ్రోలి యీనాటికి యీ స్నేహం అంతరించిపోతే సిగ్గుమాలి ఇట్లా తిరుగుతున్నాను.

ఆడదాని హృదయం గ్రహించటం కష్టం! అందులో జవ్వని! అన్నింటికీ పైన ఆంధ్రబాలిక!

నా చిన్నతనంనుంచీ మా రాయలసీమ నాయకుల బోధవల్ల ఆంధ్రదేశం అంతా ఒక్క పరిపూర్ణదేశంక్రింద భావించుకోలేదు. ఆంధ్రులంటే కోస్తా జిల్లాలవారనీ, తెలుగువారంటే నైజాం రాష్ట్రంవారనీ, రాయలసీమ వారు రాయలసీమవారే అని సిద్ధాంతీకరించుకొన్నా. కోస్తా జిల్లాలవారు మమ్మల్ని పూసుకు తిరుగుతూవుంటే, వాళ్ళు ఆంధ్రరాష్ట్రం కోసంవేసే మాయయెత్తు అనే కొందరు పెద్దలవాదన నా అణువుఅణువునా హత్తుకు పోయింది. ఇందుకు వ్యతిరేకంగా పప్పూరి రామాచార్యులవారు వాదనగాని, గుత్తి రామకృష్ణ, విద్వాన్ విశ్వం, ప్రభాకరుల స్నేహం కాని నన్ను మార్చలేకపోయాయి. కల్లూరి సుబ్బారావుగారు గోడమీద పిల్లివాటం. అసలు ఆయన కన్నడిగ. రాయలసీమవాసి. తెచ్చిపెట్టుకున్న తెలుగుతనం ఆయనది. రాయలసీమ అంతా కన్నడరాష్ట్రంలో కలపాలనే ఉద్దేశం ఆయనకు ఉన్నదేమోనని నా అనుమానం. సూర్యనారాయణరావు, మృత్యుంజయ శాస్త్రులు హృదయంలో అరవలు. వారి నిలువెల్లా 'ద్వేషం' తప్ప నాకు ఇంకొకటి కనపడలేదు. అయినా కుర్రవాణ్ణి. కుర్రతనంలో ఏవో భావాలు హృదయాన్ని హత్తుకు పోయాయి. అవి పోవాలంటే గుడ్డనుపట్టుకొన్న మచ్చలు పెట్రోల్‌తో కడిగితే పోయినట్లుగ పోవాలి. ఆ పెట్రోలే మాకృష్ణవేణి మాటలు కావుకదా!

కృష్ణవేణిలోని అందం అంతా దేహగతం కాకపోవచ్చు. ఆమె వ్యక్తిత్వమే పరమ సౌందర్యమూర్తి మంతమైనది. ఆమెలోని కాంతి తారకారజను. మెఱుము తళుకు బెళుకు వెన్నజిడ్డు, వెన్నెల వెలుగు. ఆమె అమృత గుళిక, మా ఇద్దరి యెడబాటు కలిగిననాటినుండి

రోజులు రోజులు నెలలు నెలలు తరలిపోతూ వుంటే, నాకామె మరీ దగ్గర అయి నేనామెను ప్రేమిస్తున్నాననుభావం దృఢమైపోయింది. ఇంతేనా? నన్నామెచేసిన అవమానం నేను మరచిపోగలనా?

## 5

శీతాకాలం వచ్చింది. చామంతుల సౌరభాలు నా దగ్గరగానన్నా రాలేదు. పెన్నానది ప్రవాహ రేఖలు నన్ను చుట్టుముట్టనన్నా చుట్టముట్టలేదు. పెనుకొండ కొండ రహస్యాలు నాచెవిలో గుసగుస లాడలేదు. లేపాక్షి బసవయ్య గంగడోలు నా చేతికందలేదు. కృష్ణవేణి కృష్ణాతీరంలో కృష్ణా జిల్లాలో వుండిపోయింది కాబోలు అనుకొన్నాను.

ఆసాయంత్రం రైలుదిగి మా యింటికీ కృష్ణవేణి, కృష్ణవేణి తండ్రి చక్కా వచ్చారు, ఒక్క నిమిషం నా హృదయస్పందనం ఆగిపోయింది....! ఆ బాలికను చూడటంతోటే. నాకు కోపం మరీఎక్కువయింది. నెహ్రూగారు, పటేలుగారు అన్న మాటలు, మున్షీగారి 'లింగూ' ఇజమూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి. రాయలసీమను, కలుపుకునేందుకు ఆంధ్రరాష్ట్రం దండెత్తి వచ్చినట్లయింది. ఆమెరాకవల్ల కొంచెం అభిజాత్యం, మరికొంచెం ఉడుకుబోతుతనం, ఇంకా కొంచెం అవమానతత్వం, అసలు 'ఇన్‌పీరియారిటీ కాంప్లెక్సు' మిశ్రమమై ఒక 'కోధ కొళంబు' నాలో తయారయింది. ఈ కొళంబే ఆమెచేత తినిపించ దలచు కొన్నాను.

మా అమ్మగారు, మా నాన్నగారు, మాచెల్లెలు వారినెంతో ఆదరించారు. మనం మాత్రం ఈషణ్మాత్రమూ లొంగలేదు. కృష్ణవేణి తండ్రితో ముభావంగా మూడో నాలుగో కబుర్లు చెప్పాను. కృష్ణవేణితో స్పష్టమైన మౌనం వహించా (ఈనాడు మా కథ రాస్తున్నాను గనుక ఈ మాటు ఆర్ద్రత అయినా దొర్లుతున్నదిగాని – ఆనాడు అసలే ఆర్ద్రతలేదు.)

నా మౌనం అర్ధరాత్రి ఆకాశంలోకి చొచ్చుకొనిపోయే గుడి శిఖరం. నా మౌనం మిట్టమధ్యాహ్నం నడియెండ కనులు ముడుచుకొన్న లేపాక్షీ బసవయ్య మౌనం. నేను ఎందుకు ఉపమానాలు చెబుతున్నానో నాకే అర్థం కాదు. ఆ ఉపమానాల ధ్వని నాకు గోచరించలేదు. 'కామకూరా'లోని 'డైబుట్సు'లా అంతర్దృష్టివంతుణ్ణయ్యాను. 'శ్రావణ బెలుగోలా' 'గోమటేశ్వరుడు'లా ఉత్తుంగోర్ధ్వదృష్టివంతుణ్ణయ్యాను.

కృష్ణవేణి మూడురోజులు నన్ను మాట్లాడించదానికి విఫల ప్రయత్న అయినది. తన్ను క్షమించమన్నది. శ్రీబాగ్ ప్యాక్టు తలుచుకోమన్నది. మనకు ఆంధ్రరాష్ట్రం గొడవలు అక్కరలేదన్నది. స్నేహమే ప్రధానమన్నది. నేను చలించలేదు. ఇంతైనా ధ్వనించలేదు.

ఒకనాడు కృష్ణవేణి ధర్మవరం ఊరుచివర వాగుప్రక్క నేను ఒక్కణ్ణి కూర్చునివుంటే– అక్కడ వున్నట్లు ఎట్లా గ్రహించిందో – నిర్భయంగా నా దగ్గరకువచ్చి కూర్చుంది.

"నరసింహం! నీ హృదయంలో అంతకోపం నిండివుందని నే నెప్పుడూ అనుకోలేదు. ఆంధ్రరాష్ట్రం అంటే నాకున్న ప్రేమ అలాంటిది. అంతేనేగాని నీమీదనాకేమి వున్నది? నువ్వు చెప్పకుండా వెళ్ళిపోయిన తరువాత నేను పడిన బాధ నా కన్నతల్లి కృష్ణవేణి నన్ను ఓదార్చినా తీరలేదు."

"అయితే....!"

"నా హృదయంలోవున్న కొద్ది సిగ్గును తొలగించుకొని, నిన్ను అర్థించడానికి వచ్చాను."

నేను మాట్లాడలేదు. కాని, ఏదో ఒక్క వెలుగు మెరుపు మెరసినట్లయింది.

"ఒక టెన్నిస్ పందెంతో ప్రారంభమైన మన స్నేహం ఒక రాష్ట్ర వాదనతో ఆఖరు కావలసిందేనా? నీ హృదయం ఏ రీతిగానూ కరగదా? క్షంతవ్యురాలనని ఎంత వేడుకొన్నా నీ పెదవుల్లో మందహాసరేఖలు ఇంతైనా చిగురించవా?"

"కృష్ణవేణీ! నువ్వు చేసిన దోష మేమున్నది? మేము రాయలసీమవాళ్ళం. సర్కార్ జిల్లావాళ్ళ స్నేహానికి ఎల్లా పాత్రులమవుతాం –?"

"రాష్ట్రం నేను కావాలీ అంటే వచ్చేదీలేదు. నువ్వు అక్కరలేదంటే రాకనూపోదు. పట్టాభిగారు నేడోరేపో రాష్ట్రపతి కానున్నారు. అయినా ఆయనకు రాష్ట్రం అంటే ఏ మాత్రమూ పట్టింపూలేదు. ప్రకాశంగారు నేడు రాహువు క్రమ్మిన చంద్రునిలా వున్నారు. రంగాగారి మాటలు వృథాడంబర ఫెళఫెళార్భాటాలు...! అందుచేత రాష్ట్రం రాదనీ నాకు గట్టినమ్మకం కలిగింది. ఆంధ్రులు వొట్టి దద్దమ్మలు! తాటాకుమంటగాళ్ళు! పౌరుషహీనులు! కడుపు కక్కుర్తిగాళ్ళు! లంచాల దాసులు...! నాకు రాష్ట్రం అవసరంలేదు. మద్రాసు రాజధానిలో వుంటే ఏ అరవ హెడ్‌మాస్టరో, నాయరు కలెక్టరో, మంగుళూరు డాక్టరో, ఉడిపి కాఫీహోటలో – వీరివల్ల కోస్తా జిల్లాల వాళ్ళం అంతా ఆంధ్రులమని ఉద్ధరింపబడగలం. అవన్నీ ఇప్పుడు మన కనవసరం. నాకు కావలసింది స్నేహం."

"సరే...! కాస్త స్నేహంతీసికో...! నేను నీకు స్నేహితుణ్ణి కానని నీకు తోచడం ఎందువల్ల కలిగింది...? తెల్లవారుకట్ల మిమ్మల్ని లేపడం ఇష్టం లేక మొదటిబస్సు అందుకుందామని లేచి వెళ్ళిపోయాను. రాయలసీమవాళ్ళం ఎప్పుడూ బస్సులు మిస్సవుతూనే ఉంటాం.కాని నాకు ఆ బస్సుమాత్రం దొరికింది....!"

"అర్జున విషాదయోగం మాని, రాజకీయాలు అవతలకు త్రోసి, ఇన్నాళ్ళ స్నేహం యొక్క మధురానుభూతితో నేను అంజలిపట్టి నిన్ను అర్థించడానికి వచ్చాను. నీ కంఠాన కంఠహారంగా దాల్చుతావో, కాలిక్రింద రాచిపారవేస్తావో....!"

నేను మాట్లాడకుండా లేచాను. నేను అడుగులు సాగించాను. నా ప్రక్కనే కృష్ణవేణి నడిచివస్తూ వుంది.

నా రాయలసీమ ఆంధ్రలో అంతర్ధానం కాదా? కృష్ణవేణి హృదయంలో నేనులేనా! కృష్ణవేణి తుంగభద్రలు తెలుగునాటికీ రాయలనాటికీ అడ్డుప్రవాహాలా! ఈ రెండుసీమలను అనకట్టలవల్ల వరదలై పొంగి ప్రవహించి ఎండిపోయిన మా మా బ్రతుకులను శేరీభూములను చేసి బంగారు పంటలను పండిచవా?

ఒక స్త్రీని ఇంతకలతపెట్టి ఒక పురుషుని కడకు అర్థించడానికి వచ్చే లాగు చేశాను. మూర్ఖుణ్ణి! తనంతట తాను పాల్కడలై ప్రవహించి వచ్చిన ఒక బాలికను నిరసించడానికి ఎవరికి ధైర్యం ఉండగలదు?

నేను చటుక్కున ఆగి ఆమెవైపు తిరిగాను. ఆమె కనులనుండి నీరు ప్రవాహాలై ఆమె నాప్రక్కనే నడిచి వస్తూంటే భూమిమీద ఏటవాలుగా పడుతున్నది. ఆమెకూడా ఏదో వెడనవ్వుతో నావైపుచూచింది. చేరుమాలుతో కన్నులు తొందరగా తుడుచుకున్నది.

"కృష్ణవేణీ!" అని నా కంఠంలో నుండి రుద్ధమైన వాక్కు విని వచ్చింది. నాకేసిచూస్తూ, దీనమైన నవ్వునవ్వుతూ తలపంకించింది కృష్ణవేణి. ఆమెచేతులు నాచేతుల్లోకి తీసుకొన్నాను. ఆమె మోము నాచేతుల్లో దాచుకుంది.

కృష్ణవేణీ! ఆంధ్రదేశపు భావిచరిత్ర ఒక మహా సంగమేశ్వరం...! మన జీవితాలు కృష్ణ తుంగభద్రాది సంగమేశ్వరాలు చేయగలవా!"

"అందుకనే మహాబలేశ్వరం నుండి ప్రవహించి మీ దగ్గరకు వచ్చాను. నా ఆత్మప్రభువు...." అని అన్నది.

"ఈ భరత దివ్యక్షేత్రంలో - ఈ ఆంధ్ర మహాక్షేత్రంలో - ఎన్ని సంగమేశ్వరాలు ఉన్నవో...!